# సింగిల్ పేజీ కథలు

## ఈ మగాళ్ళంతా ఇంతే

**ఎన్నడూ బాగా పొద్దుగూకాక గాని ఆఫీసు నుండి ఇంటికి చేరని తండ్రీకొడుకులిద్దరూ, నా కంటే ముందుగా ఇంటికి వచ్చేసి దేని గురించో చాలా సీరియస్‌గా చర్చించుకుంటున్నారు.**

"ఏంటోనమ్మా, ఈ రోజుల్లో ఎవర్ని నమ్మాలో, ఎవర్ని నమ్మకూడదో అర్థం కావడం లేదు" అన్నాడు నా కొడుకు ఉపోద్ఘాతంగా.

"ఒరేయ్ ఏ విషయమూ తిన్నగా చెప్పవు కదా. ముద్దముద్దకీ నారాయణ అన్నట్లు, ప్రతీ విషయానికీ ఈ నస తప్పదా?" కసురుకున్నాను.

"తప్పదు. కొన్ని బాధాకర విషయాలు చెప్పేటప్పుడు ఈ నసని ముందుగా ప్లే చేయక తప్పదు. కంచి స్వామి అరెస్టులాంటి విస్తుపోయే వార్తొకటి చెప్పబోతున్నా, గుండె దిటవు చేసుకొని శాంతంగా విను" అన్నాడు వాడు.

"ఒరేయ్ నాన్నా, కాటన్ దొర కట్టడం కన్నా, నా గుండె గట్టిదిరా...మదర్ థెరిస్సా మనసుకన్నా నా మనసు శాంతమైనదిరా. కాబట్టి నామీద లేశ మాత్రమైనా అపోహ పెట్టుకోకుండా, ఇప్పటికైనా ఆ విషయాన్ని ధైర్యంగా చెప్పి త్వరగా పుణ్యం కట్టుకోరా" చెప్పాను ఆ నసని భరించలేక.

"త్రిషకి ఎవడో ప్రియుడున్నాడు" కోపం బాధ మిళితం చేసి రహస్యం చెప్పినట్టు చెవిలో గట్టిగా ఊదాడు.

అరికాలి మంట నషాళానికి తాకింది నాకు.

"త్రిషకి ప్రియుడున్నాడో, మోనికాకి మొగుడున్నాడో మనకెందుకురా. అదేమైనా మన ఒంటి సమస్యా? ఇంటి సమస్యా? లేదా జాతీయ సమస్యా? ఈ మాత్రం దానికేనా అరగంట నుండి నసపెడుతూ ఉరిడిలా నా బుర్ర దొలిచేస్తున్నావ్" అంతెత్తున లేచి గయ్‌మన్నాను వాడి మీద.

"అయ్యో త్రిష అంటే సినిమా త్రిష కాదు. అదే నీ ఫ్రెండు కూతురు. నీకు కాబోయే కోడలు. త్రిషలా ఉంటుంది గదాని ఆ కోడ్ భాష వాడాను" అన్నాడు నొక్కి నొక్కి మందర స్వరంతో.

"ఛ..ఆ అమ్మాయి అలాంటిది కాదురా..తప్పురా అలాంటి నిందలు వేయకూడదు" చెప్పాను నేను.

"నేను చేసుకోబోయే అమ్మాయి గురించి చెడ్డగా చెప్పుకోవడం నాకు మటుకు సరదానా. ఉన్నమాటేగా చెప్తున్నాను" అన్నాడు వాడు.

"ఉద్యోగాలకని వెళ్ళిన మహిళల వెనక ఏవేవో అడ్డగాడిదలు పనిగట్టుకొని పిచ్చికూతలు పెడుతుంటాయి. అలాంటివాటిని పట్టించుకుంటే మేం బయటకి వెళ్ళి ఉద్యోగాలు చేయలేం. అయితే ఏ అడ్డగాడిదరా ఆ కారు కూతలు కూస్తున్నది?" గట్టిగా అడిగాను.

"ఇంకెవరు. ఈ పుత్రరత్నమే" అన్నారాయన.

"నేనేం టి.వి. ఛానల్సులా అత్యుత్సాహం ప్రదర్శించి గోరంతలని కొండంతలుగా చెప్పడం లేదు. నిఖార్సయిన సాక్ష్యంతోనే చెబుతున్నా" అన్నాడు వాడు.



"నిఖార్సయిన సాక్ష్యమా! ఏమిటది?" అడిగాను.

"మధ్యాహ్నం లంచ్ టైంలో తనని కలిసినప్పుడు తన హ్యాండ్ బ్యాగ్‌లో ఒక ఉత్తరం కన్పడింది. తనకి తెలియకుండా దాన్ని తీసి చదివాను. అంతే నాలో నెత్తురు సలసల మరిగిపోయింది. ఆ ఉత్తరం గురించి అక్కడే దాన్ని నిలదీయాలనిపించింది. కానీ సభ్యత సంస్కారం అడ్డురావటంతో ఎలాగోలా తట్టుకొని సాక్ష్యం కోసం ఆ ఉత్తరాన్ని పట్టుకొచ్చేసాను" అన్నాడు వాడు ఆ ఉత్తరాన్ని నాకు అందిస్తూ. ఉత్తరం విప్పి చదివాను.

"హాయ్ రత్నం,

రేపునా బర్త్ డే. రేపు సాయంత్రం ఏడు గంటలకి నీ పేరల్‌లో పార్టీ. తప్పకుండా రా. బాగా ఎంజాయ్ చేయచ్చు. మరిచిపోవుకదూ.

నీ

రాము"

ఉత్తరం చదివి తండ్రీ కొడుకుల వంక చూసాను. వారి ముఖాల్లో ఏదో అర్థంకాని బాధ.

"చూడు. నువ్వింకేం చెప్పొద్దు. అలాంటి పిల్ల మనింటికి కోడలిగా రావడానికి వీల్లేదు. పెళ్ళి క్యాన్సిల్ చేసుకుంటున్నామని చెప్పెయ్. నీ ఆత్మీయురాలి కూతురుగదాని, ఈ విషయానికి మసిపూసి మారేడుకాయ చేస్తేమటుకు, పెళ్ళి పందిట్లో ఈ విషయాన్ని బయటపెట్టి వాళ్ళ పరువును బజారుకి ఈడ్చవలసి వస్తుంది" కళ్ళు పెద్దవి చేసుకొని హెచ్చరించినట్లు చెప్పాడు.

అతని వంక చూసాను.

"భావం అదే. భాష వాడిది" అన్నట్టు తలూపారు అతను.

"మీ తెలివి తెల్లారినట్లుంది. రాము అంటే మీ పెద్దన్న కూతురు రామలక్ష్మి. తన బర్త్‌డే పార్టీకి రత్నాన్ని పిలవడానికని రత్నం దగ్గరికి వెళ్ళిందట. ఆ సమయంలో అది సీట్‌లో లేకపోవడంతో ఈ ఉత్తరం వ్రాసి దాని హాండ్ బ్యాగ్‌లో పడేసి వచ్చిందట. నన్ను కూడా పిలిచి ఈ విషయం చెప్పి రత్నాన్ని తీసుకురమ్మంది. మిమ్మల్ని పిలవడానికని మీ అన్నవదిన ఇప్పుడు వస్తారట. అదీ సంగతి. అయినా మీ మగాళ్ళంతా ఇంతే. మొగుడుగా ప్రమోషనొస్తే చాలు, ప్రతీ చిన్న విషయాన్ని భూతద్దంలో చూసి పెళ్ళాన్ని అనుమానించడం మొదలెడతారు" అన్నాను అక్కడనుండి లేస్తూ.

"అప్పటికీ చెబుతూనే వున్నా, ఎవరిపట్లనైనా అనుమానం వస్తే, ఆ వ్యక్తినే కలిసి పూర్తి వివరాలు తెలుసుకొని అనుమానం నివృత్తి చేసుకోవాలి, అంతేగాని ఇలా పిచ్చిపిచ్చిగా ఆలోచిస్తే అది పెనుభూతంగా మారి, మరిన్ని అనర్థాలకు దారితీస్తుందిరా అని" తిట్టుకుంటూ తనూ లేచారు.

తెల్లబోయి వింటున్న సుపుత్రుడు మటుకు తన తొందరపాటుకు ఏడవలేక నవ్వలేక చుక్కలు లెక్కబెడుతున్నాడు.

**-సాయిప్రియ** (విజయనగరం)